



# నేటి దిక్సూచి

తెలుగు దిన పత్రిక

TGTEL/25/A31

ప్రచురణ. రంగారెడ్డి, సంపుటి:01 సంచిక :159 ఎడిటర్ పి. అలివేలు పేజిలు : 04, వెల. 2రూ/ సోమవారం- 06 - జూలై- 2026





## రామమందిర విరాళాల దోపిడీకి BJP`RSSలే బాధ్యత వహించాలి

### కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే




- రామాలయ విరాళాల చోరీపై మండిపడ్డ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే
- ఈ దోపిడీకి బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లే బాధ్యత వహించాలని డిమాండ్
- రాజకీయ ప్రయోజనాల కోసం బీజేపీ మతాన్ని వాడుకుంటుందని మండిపాటు

ఢిల్లీ : అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగానికి బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లే కారణమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు.

## ముంబయిని ముంచెత్తిన కుండపోత వర్షం

### రెడ్ అలర్ట్ జారీ- వరదలతో జనజీవనం అస్తవ్యస్తం

- 23 గంటల్లో 300 మి.మీ. వరకు వర్షపాతం
- ముంబయి, రాయ్‌గఢ్‌కు ఐఎండీ రెడ్ అలర్ట్- లోతట్టు ప్రాంతాలు జలమయం
- భవనం బాల్కనీ కూలి ఆందోళన, సహాయక చర్యలు ముమ్మరం



ఢిల్లీ : ముంబయి మహానగరాన్ని కుండపోత వర్షాలు ముంచెత్తాయి. శనివారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో నగరంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. పరిస్థితి తీవ్రంగా మారడంతో భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ముంబయి, రాయ్‌గఢ్ జిల్లాలకు రానున్న మూడు గంటల పాటు రెడ్ అలర్ట్ జారీ చేసింది. కొన్ని ప్రాంతాల్లో గత 23 గంటల్లోనే 250 నుంచి 300 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైనట్లు వెల్లడించింది. ఐఎండీ వివరాల ప్రకారం, శనివారం ఒక్కరోజే ముంబయిలోని పలు ప్రాంతాల్లో కేవలం 12 గంటల వ్యవధిలోనే 20 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సముద్రంలో నీటి మట్టం ఎక్కువగా ఉన్న సమయంలోనూ భారీ వర్షం కురవడంతో నీటి నిల్వలు మరింత పెరిగాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు పూర్తిగా నీటమునిగాయి. రహదారులపై భారీగా నీరు నిలవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. భారీ వర్షాల ధాటికి ముంబయిలోని బేలాపూర్ ప్రాంతంలో శిథిలావస్థలో ఉన్న ఓ భవనం బాల్కనీ కూలిపోయింది. ప్రస్తుతం ఆ భవనం అత్యంత ప్రమాదకర స్థితిలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. మిగతా..2లో

## టెహ్రాన్‌లో అలీ ఖమేనీ అంత్యక్రియలు ప్రారంభం..

# హాజరైన ముగ్గురు కుమారులు

- టెహ్రాన్‌లో ఇవాళ ప్రారంభమైన ఇరాన్ అత్యున్నత నేత అయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియల ప్రార్థనలకు ఆయన ముగ్గురు కుమారులు హాజరయ్యారు.
- తండ్రి మరణం తర్వాత ఇరాన్ సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టిన మొజ్తబా మాత్రం అక్కడ కనిపించలేదు.



టెహ్రాన్ (ఇరాన్)జులై 5: ఇరాన్‌ను సుదీర్ఘకాలం (1989 నుంచి 2026 వరకు) పరిపాలించిన సుప్రీం లీడర్ అయాతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలు ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో తీవ్ర భావోద్వేగాల మధ్య ప్రారంభమయ్యాయి. ఇవాళ (ఆదివారం) టెహ్రాన్‌లోని ప్రసిద్ధ 'ఇమామ్ ఖొమేనీ గ్రాండ్ మొసల్లా' మతపరమైన కాంప్లెక్స్‌లో నిర్వహించిన అధికారిక అంత్యక్రియల ప్రార్థనలకు లక్షలాది మంది ప్రజలు, ప్రముఖులు హాజరయ్యారు. అయితే, ఈ ప్రార్థనల్లో అలీ ఖమేనీ వారసుడు, ఇరాన్ ప్రస్తుత సుప్రీం లీడర్ అయిన మొజ్తబా ఖమేనీ ఎక్కడా కనిపించలేదు. మిగతా..2లో

## కన్నెపల్లి పంప్‌హౌస్‌ను ముట్టడించి మోటార్లు ఆన్ చేస్తాం




- నీటి ప్రాజెక్టుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు.
- పోలవరం ప్రాజెక్టు, కన్నెపల్లి పంప్‌హౌస్‌లను రేవంత్ సర్కార్ గాలికి వదిలేసిందని ఆగ్రహించారు.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కన్నెపల్లి పంప్‌హౌస్‌ను మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ సందర్శించారు.

జయశంకర్ భూపాలపల్లి: నీటి ప్రాజెక్టుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు.

## గత సమావేశాల్లోని నిర్ణయాలు

# అమలు కావడం లేదు

- హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టుపై కేంద్రమంత్రులకు సీఎం రేవంత్ రెడ్డి లేఖలు
- గత నెలలో జరిగిన సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు అమలు కావడం లేదన్న సీఎం
- వ్యక్తిగతంగా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి




హైదరాబాద్: హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టుపై కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, మనోహర్ లాల్ ఖట్టర్‌కు సీఎం రేవంత్ రెడ్డి లేఖలు రాశారు. గత నెలలో జరిగిన సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు అమలు కావడం లేదన్నారు. మెట్రో రైలుపై అధ్యయన బాధ్యతలు ఎస్‌బీఐ క్యాప్స్‌కు అప్పగించాలని సీఎం కోరారు. షరతులు, విధివిధానాలు వెంటనే ఖరారు చేయాలన్నారు. మెట్రో మొదటి దశ టేకోవర్, రెండో దశ అనుమతులు జాప్యం అవుతున్నాయని, వ్యక్తిగతంగా చొరవ తీసుకోవాలని కేంద్ర మంత్రులను సీఎం రేవంత్‌రెడ్డి లేఖల్లో కోరారు. ఇటీవలే కేంద్రమంత్రులతో భేటీ అయిన సీఎం : మెట్రో రైలు పెండింగ్ అంశాల పరిష్కారానికి జోక్యం చేసుకోవాలని కోరుతూ కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి ఇది వరకే పలుమార్లు లేఖలు రాశారు. తెలంగాణలో మెట్రో రైలు విస్తరణకు సహకరించాలని రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మిగతా..2లో

## కన్నెపల్లి పంపు దగ్గరకెళ్లి కేటీఆర్

# నాటకమాడుతున్నారు..

### మంత్రి ఉత్తమ్ సెటైర్లు




- పదేళ్లలో తెలంగాణ ప్రజల జీవితాలను బీఆర్ఎస్ తాకట్టు పెట్టిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.
- పదేళ్లలో నీటి పారుదల శాఖను నాశనం చేశారని ధ్వజమెత్తారు.

హైదరాబాద్, జులై 5 : పదేళ్లలో తెలంగాణ ప్రజల జీవితాలను బీఆర్ఎస్ తాకట్టు పెట్టిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లలో నీటి పారుదల శాఖను నాశనం చేశారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్

## జులై 8 నుంచి సదరం స్లాట్ బుకింగ్ పునః ప్రారంభం



దివ్యాంగుల కోసం పింఛన్‌కు సంబంధించిన వైకల్య ధ్రువపత్రాల (సదరం) జారీ సేవల్లో కీలక సంస్కరణలు తీసుకొచ్చినట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ వెల్లడించారు.

జులై 8 నుంచి సదరం స్లాట్ బుకింగ్ పునః ప్రారంభం అవుతుందని తెలిపారు.

అమరావతి, జులై 05: దివ్యాంగుల కోసం పింఛన్‌కు సంబంధించిన వైకల్య ధ్రువపత్రాల (సదరం) జారీ సేవల్లో కీలక సంస్కరణలు తీసుకొచ్చినట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ వెల్లడించారు. ఆదివారం రాజధాని అమరావతిలో ఆయన మాట్లాడుతూ.. మిగతా..2లో

## తెలంగాణలోని పలు జిల్లాలకు ఐఎండీ ఎల్లో అలర్ట్ జారీ..



తెలంగాణలోని పలు జిల్లాలకు భారత వాతావరణ శాఖ(ఐఎండీ) ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

హైదరాబాద్ సహా మరి కొన్ని జిల్లాల్లో రెండ్రోజుల పాటు అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది.

హైదరాబాద్: తెలంగాణలోని పలు జిల్లాలకు భారత వాతావరణ శాఖ(ఐఎండీ) ఎల్లో అలర్ట్ జారీ చేసింది. హైదరాబాద్ సహా మరి కొన్ని జిల్లాల్లో రెండ్రోజుల పాటు అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. అయితే రాష్ట్రవ్యాప్తంగా విస్తారమైన వర్షాలు కురిసే పరిస్థితి ప్రస్తుతం కనిపించడం లేదని స్పష్టం చేసింది. మరో రెండు రోజుల తర్వాత వర్షాల తీవ్రత మరింత తగ్గి, మిగతా..2లో

## సముద్రంలో గల్లంతైన విశాఖ మత్స్యకారులందరూ సురక్షితం




- ఒడిశా తీరంలో చిక్కుకున్న విశాఖపట్నం మత్స్యకారులు
- సాంకేతిక లోపంతో సముద్రంలో నిలిచిపోయిన బోటు
- 10 మందిని సురక్షితంగా కాపాడిన ఒడిశా మెరైన్ పోలీసులు
- ఏపీ ప్రభుత్వం చొరవతో వేగవంతమైన సహాయక చర్యలు
- మత్స్యకారులను స్వస్థలాలకు తరలించేందుకు ఏర్పాట్లు

## త్వరలో స్థానిక ఎన్నికలు వస్తున్నాయి...

# అన్ని చోట్లా గెలవాల్సిందే

### కుప్పం నుంచి సీఎం చంద్రబాబు పిలుపు

- క్షేత్రస్థాయిలో పొలిటికల్ గవర్నెన్స్ అవసరమన్న చంద్రబాబు
- అధికారులు, పోలీసులతో సమన్వయంతో పనిచేయాలని కార్యకర్తలకు సూచన
- త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు గెలవాలని పిలుపు
- పనితీరు ఆధారంగానే పార్టీలో పదవులు ఉంటాయని స్పష్టీకరణ
- కుప్పంలో రౌడీయిజం చేస్తే సహించేది లేదని హెచ్చరిక




అమరావతి : తన సొంత నియోజకవర్గం కుప్పంలో పర్యటిస్తున్న సీఎం చంద్రబాబు, మూడో రోజు పార్టీ శ్రేణులకు కీలక దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడం, ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా కార్యకర్తలు వ్యవహరించాల్సిన తీరుపై ఆయన సుదీర్ఘంగా ప్రసంగించారు. పై సాయిలోనే కాకుండా క్షేత్ర స్థాయిలో కూడా పొలిటికల్ గవర్నెన్స్ ఉండాలని, అప్పుడే నిజమైన సుపరిపాలన సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. మిగతా..2లో

## హాంకాంగ్ ఎయిర్‌పోర్టులో చిక్కుకున్న తెలుగు ఫ్యామిలీ..

# అండగా నిలిచిన మంత్రి లోకేశ్




- పాస్‌పోర్టులు పోగొట్టుకుని హాంకాంగ్ విమానాశ్రయంలో చిక్కుకున్న తెలుగు ఫ్యామిలీ
- తమను ఆదుకోవాలంటూ మంత్రి నారా లోకేశ్‌కు 'ఎక్స్'లో బాధితురాలి విజ్ఞప్తి
- తక్షణం స్పందించి కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్‌కు సహాయం కోరిన లోకేశ్
- హైదరాబాద్ నుంచి చికాగో వెళుతుండగా కాథే పసిఫిక్ విమానంలో ఘటన
- ఐదు, మూడేళ్ల చిన్నారులతో 52 గంటలుగా ఎయిర్‌పోర్టులోనే ఎదురుచూపులు

మొదటి పేజి తరువాయి

# సముద్రంలో గల్లంతైన విశాఖ మత్స్యకారులందరూ సురక్షితం

అమరావతి : సముద్రంలో గల్లంతైన మత్స్యకారులు సురక్షితంగా ఉన్నారని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. ఒడిశా తీరంలో చిక్కుకుపోయిన విశాఖపట్నంకు చెందిన మత్స్యకార బోటులోని సిబ్బందిని ఒడిశా మెరైన్ పోలీసులు సురక్షితంగా రక్షించారని తెలిపారు. బోటు యజమాని దానయ్యతో సహా మొత్తం 10 మంది మత్స్యకారులు క్షేమంగా ఒడ్డుకు చేరారని, ఈ వార్త అందరిలో ఆనందాన్ని నింపిందని మంత్రి వివరించారు. ఈ ఘటనపై ఆయన స్పందిస్తూ, సహాయక చర్యల వివరాలను వెల్లడించారు. తమ మత్స్యకారులు కష్టాల్లో ఉన్నారన్న సమాచారం అందిన వెంటనే ఏపీ ప్రభుత్వం తరఫున తాము వేగంగా స్పందించామని ఆయన వివరించారు. ఒడిశా మెరైన్ పోలీసులతో పాటు, అక్కడి మత్స్యశాఖ ఉన్నతాధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ సహాయక చర్యలను వేగవంతం చేసినట్లు తెలిపారు. ఏపీ ప్రభుత్వ చొరవ, ఒడిశా అధికారుల సహకారంతోనే ఈ ఆపరేషన్ విజయవంతమైందని పేర్కొన్నారు. విపత్కర పరిస్థితుల్లో తక్షణమే స్పందించి, తమ మత్స్యకారుల ప్రాణాలను కాపాడినందుకు ఒడిశా ప్రభుత్వానికి, మెరైన్ పోలీసులకు, మత్స్యశాఖ అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రక్షించబడిన మత్స్యకారులందరినీ వీలైనంత వేగంగా, సురక్షితంగా వారి వారి స్వస్థలాలకు చేర్చేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి హామీ ఇచ్చారు. వారిని సురక్షితంగా వెనక్కి తీసుకువచ్చే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని స్పష్టం చేశారు. ఈ కష్టకాలంలో మత్స్యకార కుటుంబాలకు తమ కూటమి ప్రభుత్వం, అధికారులు అండగా నిలిచారని పేర్కొంటూ, వారికి అభినందనలు తెలియజేశారు. సకాలంలో స్పందించి, రెండు రాష్ట్రాల సమన్వయంతో ప్రాణనష్టం జరగకుండా నివారించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

## జులై 8 నుంచి సదరం స్లాట్ బుకింగ్ పునః ప్రారంభం

జులై 8 నుంచి సదరం స్లాట్ బుకింగ్ పునః ప్రారంభం అవుతుందని ప్రకటించారు. జులై 13 నుంచి వైకల్య నిర్ధారణ పరీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇకపై జోనల్ విధానంలోనే సదరం స్లాట్ బుకింగ్ ఉంటుందని వివరించారు. రాష్ట్రాన్ని 6 జోన్లుగా ప్రభుత్వం విభజించిందని చెప్పారు. సొంత జోన్‌లోని జిల్లాల్లోనే స్లాట్ బుక్ చేసుకునే అవకాశాన్ని దివ్యాంగులకు కల్పించామని మంత్రి సత్యకుమార్ వివరించారు. తద్వారా సుదూర జిల్లాలకు వెళ్లాల్సిన ఇబ్బందులకు చెక్ పెట్టినట్లు అయిందన్నారు. స్లాట్ బుకింగ్‌కు స్వీయ ధ్రువీకరణ పత్రం తప్పనిసరి అని మంత్రి సత్యకుమార్ చెప్పారు. వైకల్య కేటగిరీపై స్పష్టత లేకపోతే డాక్టర్ సర్టిఫికేట్ తప్పనిసరిగా ఉండాలని అన్నారు. తప్పుడు స్లాట్ బుకింగ్‌లకు ప్రభుత్వం అడ్డుకట్ట వేయనుందని తెలిపారు. హాజరు నమోదు అనంతరమే వైకల్య పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. సదరం పోర్టల్‌లో ఆన్‌లైన్ హాజరు నమోదు తప్పనిసరి అని వివరించారు. హాజరు నమోదుతోనే సదరం ఐడీ యాక్టివేషన్ అవుతుందని పేర్కొన్నారు. సదరం సేవల్లో పారదర్శకత పెంచే దిశగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఏపీ సేవా పోర్టల్ ద్వారా నేరుగా స్లాట్ బుకింగ్ చేసుకునే అవకాశం కల్పించామని తెలిపారు. సిటిజన్ లాగిన్‌తో ఉచితంగా అపాయింట్‌మెంట్ బుకింగ్ చేసుకోవచ్చునని చెప్పారు. సదరం ధ్రువీకరణ పత్రాన్ని ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకునే సౌకర్యం కల్పించామని అన్నారు. సచివాలయాల ద్వారా కూడా సదరం సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. 'మన మిత్ర' వాట్సాప్ సేవలో స్లాట్ లభ్యత వివరాలు పొందుపరిచామని చెప్పారు. సదరం సేవలన్నీ పూర్తిగా ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. దళారులకు ఎలాంటి నగదు చెల్లించవద్దని దివ్యాంగులకు అధికారులు స్పష్టం చేశారు. దివ్యాంగులకు ప్రయాణ భారం తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. వైద్యులపై పనిభారం తగ్గించేలా ఈ కొత్త విధానం ఉంటుందని తెలిపారు. ఈ సదరంపై అవగాహన కల్పించాలని అధికారులను మంత్రి సత్యకుమార్ ఆదేశించారు.

## తెలంగాణలోని పలు జిల్లాలకు ఐఎండీ ఎల్లో అలర్ట్ జారీ..

చాలా ప్రాంతాల్లో వర్షాలకు తాత్కాలిక విరామం లభించే అవకాశముందని ఐఎండీ అంచనా వేసింది. మరోవైపు ఈ ఏడాది నైరుతి రుతుపవనాల సీజన్ ఆశించినంత అనుకూలంగా ఉండకపోవచ్చని హెచ్చరించింది. జులై-ఆగస్టు నెలల్లో ఎల్‌నినో ప్రభావం క్రమంగా పెరగనున్న నేపథ్యంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశముందని ఐఎండీ వెల్లడించింది. సెప్టెంబర్ నాటికి ఎల్‌నినో మరింత బలపడే అవకాశం ఉండటంతో దక్షిణ భారత రాష్ట్రాల్లో వర్షాల తీవ్రత తగ్గే అవకాశముందని పేర్కొంది. ఈ ప్రభావంతో తెలంగాణలో నైరుతి రుతుపవనాల సీజన్ మొత్తం లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశాలున్నాయని ఐఎండీ అంచనా వేసింది. అయితే, అల్పపీడనాలతో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రం విస్తారంగా వర్షాలు కురిసే అవకాశముందని స్పష్టం చేసింది. సీజన్ మొత్తం ఒకే విధమైన వర్షాలు కాకుండా మధ్య మధ్యలో భారీ వర్షాలు ఆ తర్వాత విరామం వంటి ఒడిదుడుకులు కొనసాగవచ్చని తెలిపింది. గతేడాది జూన్ నెలలో తెలంగాణలో సాధారణం కంటే సుమారు 25 శాతం తక్కువ వర్షపాతం నమోదైన విషయాన్ని గుర్తు చేసింది. ఈసారీ అదే తరహా పరిస్థితులు పునరావృతమయ్యే అవకాశాలను కొట్టిపారేయలేమని పేర్కొంది. మరోవైపు వాతావరణ అంచనాలను మరింత కచ్చితంగా అందించేందుకు భారత వాతావరణ శాఖ కృత్రిమ మేధ  మెషీన్ లెర్నింగ్ (మీా) సాంకేతికతలను వినియోగిస్తున్నట్లు ఐఎండీ వెల్లడించింది. ఈ సాంకేతికతల ద్వారా వాతావరణ అంచనాల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపింది. ఈ మేరకు రైతులు ఎప్పటికప్పుడు ఐఎండీ విడుదల చేసే వాతావరణ బులెటిన్లను పరిశీలించి, వ్యవసాయ పనులను అందుకు అనుగుణంగా ప్రణాళిక చేసుకోవాలని సూచించింది.

## గత సమావేశాల్లోని నిర్ణయాలు అమలు కావడం లేదు
# కేంద్రమంత్రులకు రేవంత్ మరోసారి లేఖలు

కొద్దిరోజుల క్రితమే దిల్లీలోని రైల్ భవన్‌లో కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డితో కలిసి సీఎం రేవంత్ రెడ్డి రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు పెండింగ్ అంశాలపై విస్తృతంగా చర్చించారు. తెలంగాణ రాష్ట్రంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మెట్రో రైలు విస్తరణను చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, దీనికి కేంద్రం సహాయం అవసరమని సీఎం వివరించినట్టు సమాచారం. మెట్రో విస్తరణకు నోచుకోకపోవడంతో హైదరాబాద్‌లో నగరంలో ఎదురవుతున్న ఇబ్బందులను కేంద్రమంత్రి దృష్టికి రేవంత్ తీసుకెళ్లారు. విస్తరణకు సంబంధించిన అన్ని ప్రక్రియలను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేసిందని చెప్పిన సీఎం, దీనికి ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ ఎఫ్ సీ) నుంచి రావాల్సిన రుణాన్ని త్వరగా విడుదలయ్యేలా చొరవ చూపాలని కోరారు. భేటీ సందర్భంగా ఈ ప్రాజెక్టు చుట్టూ ఏర్పడిన రాజకీయ అంశాలు సైతం చర్చకు వచ్చినట్లు తెలిసింది. దాదాపు రెండున్నర గంటల పాటు సాగిన ఈ సమావేశంలో మెట్రో రెండో దశ అనుమతులపై ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించిన పలు అంశాలపై కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ సానుకూలంగా స్పందించారు. అయితే మెట్రో అంశం రైల్వే శాఖ పరిధిలోనిది కానందున కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రితో తాను మాట్లాడతానని హామీ ఇవ్వడంతో పాటు వెంటనే ఆ శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో ఫోన్‌లో మాట్లాడినట్లు సమాచారం.

## టెహ్రాన్‌లో అలీ ఖమేనీ అంత్యక్రియలు ప్రారంభం..
# హాజరైన ముగ్గురు కుమారులు
### శవపేటికల వద్ద కన్నీరు పెట్టుకున్న కుటుంబ సభ్యులు

అంత్యక్రియల ప్రార్థన సమయంలో అలీ ఖమేనీ ముగ్గురు కుమారులు.. ముస్తఫా, మసౌద్, మేసమ్ ఖమేనీ తమ తండ్రి శవపేటిక వెనుక నిలబడి అంజలి ఘటించారు. ఇరాన్ జాతీయ జెండాతో కప్పిన అలీ ఖమేనీ శవపేటికపై ఆయన సాంప్రదాయ నల్లటి తలపాగాను ఉంచారు. ఫిబ్రవరిలో జరిగిన వైమానిక దాడుల్లో ఖమేనీతో పాటు మరణించిన ఆయన కుమార్తె బుష్రా, కోడలు, అల్లుడు, 14 నెలల వయసున్న మనవరాలి శవపేటికలను కూడా పక్కపక్కనే ఉంచారు. ప్రార్థనల సమయంలో ఖమేనీ కుమారుడు మసౌద్ తీవ్ర భావోద్వేగానికి లోనై కన్నీరు పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్, పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బాఘేర్ గాలిబాఫ్, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్  కమాండర్-ఇన్-చీఫ్ అహ్మద్ వాహిదీ తదితర కీలక నేతలు పాల్గొన్నారు.

## రామమందిర విరాళాల దోపిడీకి
# BJP`RSSలే బాధ్యత వహించాలి



అధికారాన్ని నిలుపుకోవడానికి ఎస్ఐఆర్, డీలిమిటేషన్‌ను వాడుకుంటూ బీజేపీ సర్కార్ 'ఓట్ చోరీ' చేయడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం మతాన్ని వాడుకోవడమే కాకుండా, ఎన్నికల అవకతవకల ద్వారా ప్రజాస్వామ్య సంస్థలను కూడా బలహీనపరుస్తోందని మండిపడ్డారు. కర్ణాటకలోని చిక్కబళ్లాపురలో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని మల్లికార్జున ఖర్గే ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో కేంద్రంలోని అధికార ఎన్‌డీఏ సర్కార్‌పై తీవ్ర విమర్శనాస్త్రాలు సంధించారు. "అయోధ్యలో దేవుడి పేరుతో ఎంత దోపిడీ జరుగుతోందో మీరు చూశారు. అయోధ్యలో ఏం జరిగింది? పేదవాళ్లు విరాళాలను దుర్వినియోగం చేశారా? దళితులు చేశారా? రైతులు చేశారా? ఎవరూ కాదు. ఆర్ఎస్ఎస్, బీజేపీలతో సంబంధం ఉన్నవారే ఈ దోపిడీ చేశారు. అయోధ్య రామ మందిరంలో సుమారు రూ. 20,000 కోట్ల విలువైన ఆస్తులను దోచుకున్నారు. రామ మందిరానికి విరాళంగా ఇచ్చిన బంగారం, వెండి, చివరికి ఇటుకలను కూడా దోచుకున్నారు. ప్రతిరోజూ దేవుడి నామం జపిస్తారు. కానీ దేవుడి పేరుతో దోపిడీకి పాల్పడుతున్నారు.

# త్వరలో స్థానిక ఎన్నికలు వస్తున్నాయి... అన్ని చోట్లా గెలవాల్సిందే

మొదటి పేజి తరువాయి




శనివారం కుప్పంలో పర్యటనలో భాగంగా రైతులు, పీ4 లబ్దిదారులు, అధికారులతో వరుస భేటీలు నిర్వహించిన అనంతరం, ఆయన నియోజకవర్గ పార్టీ నేతలు, కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సమావేశానికి చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద రావు, జిల్లా అధ్యక్షుడు షణ్ముఖ రెడ్డితో పాటు ముఖ్య నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రజల సమస్యల పరిష్కారంలో పార్టీ యంత్రాంగం, ప్రభుత్వ అధికారులు, పోలీసులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలోని వాస్తవ పరిస్థితులను అధికారులకు వివరించి, ప్రజా సమస్యలను పరిష్కరించేలా చొరవ తీసుకోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పేదల పక్షాన నిలిచే టీడీపీ నేతలు, కార్యకర్తలకు ప్రభుత్వ యంత్రాంగం అండగా నిలవాలని, వారిని గౌరవించాలని అన్నారు. గత ఐదేళ్ల పాలన (2019-24) రాష్ట్రానికి ఒక పీడకల వంటిదని, ఆ సమయంలో కుప్పం నియోజకవర్గంలో కూడా ప్రశాంతతను దెబ్బతీయాలని నాటి పాలకులు విఫలయత్నం చేశారని చంద్రబాబు విమర్శించారు. గొడ్డలి పార్టీ కుట్రల పట్ల కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని, కుప్పంలో ఎవరైనా రౌడీయిజం చేయాలని చూస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయని, వాటన్నింటిలోనూ టీడీపీ నేతృత్వంలోని కూటమి అభ్యర్థులే గెలవాలని ఆయన ఆకాంక్షించారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు సహా స్థానిక సంస్థలన్నింటినీ కూటమే కైవసం చేసుకోబోతోందని ధీమా వ్యక్తం చేశారు. తెలుగుదేశం కార్యకర్తలకు సమాజంలో మంచి పేరు, గుర్తింపు ఉందని, దానికి భంగం కలిగేలా ఎవరూ ప్రవర్తించకూడదని హితవు పలికారు. పార్టీలో పదవుల కేటాయింపుపై కూడా చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. ఇకపై పనితీరు ఆధారంగానే పదవులు ఉంటాయని, నియామకాల్లో ఎలాంటి మొహమాటాలకు, సిఫారసులకు తావుండదని తేల్చిచెప్పారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించబోమని భరోసా ఇచ్చారు. బూత్ స్థాయి నుంచి ఏ పదవికైనా కార్యకర్తల ఆమోదం తప్పనిసరి అని స్పష్టం చేశారు. 2029 ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకి వచ్చి, గతంలో కంటే మెరుగైన మెజారిటీ సాధించేలా ఇప్పటి నుంచే కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తల ఆర్థిక సాధికారతకు పార్టీ కృషి చేస్తుందని, "ఇంటికో పారిశ్రామికవేత్త" విధానాన్ని పార్టీ కార్యకర్తలు కూడా అందిపుచ్చుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితాకు సంబంధించి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. అందరి ఆమోదంతో త్వరలోనే కుప్పంలో ఒక సమన్వయ కమిటీని ఏర్పాటు చేస్తామని చంద్రబాబు ప్రకటించారు.

# హాంకాంగ్ ఎయిర్‌పోర్టులో చిక్కుకున్న తెలుగు ఫ్యామిలీ.. అండగా నిలిచిన మంత్రి లోకేశ్

మొదటి పేజి తరువాయి

అమరావతి : పాస్‌పోర్టులు పోగొట్టుకుని హాంకాంగ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో చిక్కుకుపోయిన ఒక తెలుగు కుటుంబానికి తక్షణమే సహాయం అందించాలని ఏపీ విద్య, మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌ను కోరారు. హైదరాబాద్ నుంచి చికాగో వెళుతున్న ఈ కుటుంబం, మార్గమధ్యంలో తమ పాస్‌పోర్టులు ఉన్న బ్యాగును పోగొట్టుకుని తీవ్ర ఇబ్బందులు పడుతోంది.

### అసలేం జరిగిందంటే..!

రాజేశ్వరి బొల్లా అనే మహిళ తన కుటుంబంతో కలిసి ఈ నెల 2న హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి కాథే పసిఫిక్ విమానంలో చికాగోకు బయలుదేరారు. హాంకాంగ్ మీదుగా వారి ప్రయాణం సాగుతుండగా, విమానంలో తమ పాస్‌పోర్టులు ఉన్న బ్యాగును పోగొట్టుకున్నారు. దీంతో గత 52 గంటలుగా వారు హాంకాంగ్ విమానాశ్రయంలోనే చిక్కుకుపోయారు. తమతో పాటు ఐదు, మూడేళ్ల వయసున్న ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారని, పరిస్థితి చాలా క్లిష్టంగా ఉందని రాజేశ్వరి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో సహాయం కోసం మంత్రి నారా లోకేశ్‌ను ట్యాగ్ చేస్తూ 'ఎక్స్' వేదికగా ఆమె ఒక పోస్ట్ పెట్టారు. "మేము అత్యవసర పరిస్థితిలో ఉన్నాము. మాకు కొత్త పాస్‌పోర్టులు జారీ చేసేలా సరైన అధికారులతో మాట్లాడటానికి దయచేసి సహాయం చేయండి లేదా మార్గనిర్దేశం చేయండి" అని ఆమె తన పోస్టులో అభ్యర్థించారు. రాజేశ్వరి విజ్ఞప్తిపై మంత్రి లోకేశ్ తక్షణమే స్పందించారు. వారి పరిస్థితి పట్ల విచారం వ్యక్తం చేస్తూ, ఈ విషయాన్ని కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్ దృష్టికి తీసుకెళ్లారు. "ఈ విషయంలో దయచేసి జోక్యం చేసుకుని, ఆ కుటుంబానికి తక్షణ సహాయం అందించాలని కోరుతున్నాను" అని లోకేశ్ 'ఎక్స్'లో జైశంకర్‌ను అభ్యర్థించారు. తమ బ్యాగులో రెండు భారతీయ పాస్‌పోర్టులతో పాటు రెండు అమెరికా



పాస్‌పోర్టులు ఉన్నాయని రాజేశ్వరి తెలిపారు. జులై 2న తెల్లవారుజామున 2:43 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరిన 'సీఎక్స్ 672' విమానంలో ప్రయాణించిన వారు ఎవరైనా ఉంటే, తమ బ్యాగు గురించి ఏ చిన్న సమాచారం తెలిసినా అందించాలని ఆమె తోటి ప్రయాణికులను కోరారు. మంత్రి లోకేశ్ చొరవతో తమకు త్వరలోనే సహాయం అందుతుందని ఆ కుటుంబం ఆశిస్తోంది.

# కన్నెపల్లి పంపు దగ్గరకెళ్లి కేటీఆర్ నాటకమాడుతున్నారు.. మంత్రి ఉత్తమ్ సెటైర్లు

మొదటి పేజి తరువాయి

తాము అధికారంలోకి వచ్చాక ఇరిగేషన్ శాఖను చక్కదిద్దామని వ్యాఖ్యానించారు. (ఆదివారం) కాళేశ్వరం ప్రాజెక్టుపై మంత్రి ఉత్తమ్ సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. అధిక శాతం లోన్లు తీసుకొచ్చి బీఆర్ఎస్ నాయకుల లాభం కోసం కాళేశ్వరం కట్టారు తప్ప.. తెలంగాణ ప్రజల కోసం కాదని చెప్పుకొచ్చారు.

### ఇరిగేషన్ శాఖను చక్కదిద్దాం..

రూ.1.81లక్షల కోట్లు ఖర్చు చేసి నామమాత్రపు ఆయకట్టు ఇచ్చారని మంత్రి ఉత్తమ్ తెలిపారు. ఆ ప్రాజెక్టులు అన్ని అసంపూర్తిగా ఉన్నాయని అన్నారు. తాము అధికారంలో వచ్చాక ఇరిగేషన్ శాఖను చక్కదిద్దామని వివరించారు. ఉల్టా చోర్ కొత్వాల్‌కు దండే అన్నట్లుగా బీఆర్ఎస్ నేతల తీరు ఉందని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టింది కేసీఆర్ హయాంలోనే.. కూలిపోయింది వాళ్ల హయాంలోనే అని ఇంజినీర్లు రిపోర్ట్ ఇచ్చారని ప్రస్తావించారు. కన్నెపల్లి పంపు



దగ్గరకు పోయి ప్రాణహిత పంపు ఆన్ చేసి నీళ్లు ఇవ్వాలంటూ మాజీ మంత్రి కేటీఆర్ నాటకాలు ఆడుతున్నారని వ్యంగ్యంగా అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు సరిగ్గా కడితే ఈ పరిస్థితి వచ్చేది కాదని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ వల్లే కాళేశ్వరం నీళ్లు ఉపయోగించలేకపోతున్నామని అన్నారు.

### కాళేశ్వరం ప్రాజెక్టు ఫౌండేషన్ తప్పుగా ఉంది..

నాసిరక నిర్మాణం వల్లే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులు ఉపయోగించలేకపోతున్నామని మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఫౌండేషన్ తప్పుగా ఉందని అధికారులు రిపోర్ట్ ఇచ్చారని తెలిపారు. కాళేశ్వరం ఇలానే కొనసాగిస్తే ప్రమాదమని అంతర్జాతీయ, జాతీయ నీటి నిపుణులు నివేదిక ఇచ్చారని అన్నారు. కేటీఆర్ కన్నా ఎన్డీఎస్ఏ అధికారులకు నాలెడ్జ్ ఎక్కువగా ఉందని తాను అనుకుంటున్నానని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నీళ్లు స్టోరేజ్ చేసినప్పుడు కూలిపోతే కింద ఉన్న 40 ఊర్లు, భద్రాచలం కొట్టుకుపోతుందని హెచ్చరించారు. బీఆర్ఎస్ నాయకులు కమీషన్లకు కక్కుర్తి పడి తుమ్మడిహెట్టి వద్ద ప్రాజెక్ట్ కట్టకుండా తెలంగాణ ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. లేకపోతే ఎప్పుడో ఉత్తర తెలంగాణ సస్యశామలం అయ్యేదని వివరించారు. తెలంగాణ ప్రజలకు అన్యాయం చేసింది గులాబీ పార్టీనే అని ఆగ్రహించారు. కాంగ్రెస్‌కి మంచి పేరు వస్తుందనే కారణంతో తుమ్మడిహెట్టి నుంచి మేడిగడ్డకి డిజైన్ మార్చారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దుయ్యబట్టారు.

# కన్నెపల్లి పంప్‌హౌస్‌ను ముట్టడించి మోటార్లు ఆన్ చేస్తాం

మొదటి పేజి తరువాయి

పోలవరం ప్రాజెక్టు, కన్నెపల్లి పంప్‌హౌస్‌లను రేవంత్ సర్కార్ గాలికి వదిలేసిందని ఆగ్రహించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కన్నెపల్లి పంప్‌హౌస్‌ను మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ సందర్శించారు. ఈ సందర్భంగా తన పర్యటనకు వస్తున్న బీఆర్ఎస్ నేతలను పోలీసులు హౌస్ అరెస్టు చేయడంపై మండిపడ్డారు. ఎన్ని ఆంక్షలు, ఆటంకాలు కల్పించినా చివరికి కన్నెపల్లి వద్దకు చేరుకున్నామని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 'ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణ రైతులు తీవ్రంగా బాధపడుతున్నారు. పైఎత్తున పారుతున్న గోదావరి నీటి కోసం పోరాటం ఇప్పటిది కాదు. వేల టీఎంసీల నీరు వృథాగా సముద్రంలో కలిసిపోతోంది. నీళ్లు, నిధులు, నియామకాల కోసం తెలంగాణ పోరాటం సాగింది. కేసీఆర్ సంకల్పంతో నీటి ప్రాజెక్టులు రూపుదిద్దుకున్నాయి. ఆయన పాలనలో కాళేశ్వరం ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. సముద్ర మట్టానికి 80 నుంచి 90 మీటర్ల ఎత్తులో ఉన్న గోదావరి నీటిని లిఫ్ట్ ద్వారా ఎత్తిపోసే అవకాశం ఉంది. తుమ్మిడిహట్టి వంటి ప్రాజెక్టులపై అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆసక్తి చూపలేదు.



ఆనాటి పరిస్థితుల్లో ప్రాజెక్టు ప్రతిపాదనలను కూడా అడ్డుకున్నారు. మూడున్నరేళ్లలోనే కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయింది. సెంట్రల్ వాటర్ కమిషన్ సూచనలతో ఉత్తమ స్థలం ఎంపిక చేశాం. మహారాష్ట్రను ఒప్పించి వేగంగా నిర్మాణం చేశాం. ఈ ప్రాజెక్టులో మూడు బ్యారేజీలు, 15 రిజర్వాయర్లు, 21 పంప్‌హౌస్‌లు, 19 సబ్‌స్టేషన్లు, 203 కిలోమీటర్ల సొరంగ మార్గాలు ఉన్నాయి. ఈ ప్రాజెక్టులో రెండు పిల్లర్లు కుంగితే తిరిగి నిర్మించడానికి రూ.400 కోట్లు ఖర్చవుతుంది. అయితే పనులు చేపట్టేందుకు ఎల్ అండ్ టీ సంస్థ ముందుకొచ్చినా 31 నెలలుగా పనుల్లో పురోగతి లేదు. సీడబ్ల్యూసీ లెక్కల ప్రకారం ఎంత కరవు వచ్చినప్పటికీ కాళేశ్వరంలో నీరు అందుబాటులో ఉంటుంది. కోదాడ నుంచి మోతె వరకు నీరు అందించే బృహత్తర ప్రాజెక్టు కాళేశ్వరం. రోజుకు లక్ష క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసే సామర్థ్యం ఉంది. వర్షాభావ పరిస్థితుల్లో కన్నెపల్లి నుంచి నీరు ఎత్తిపోయచ్చు. ఎస్ఆర్ఎస్పీని కూడా నింపే బృహత్తర ప్రాజెక్టు ఇది. రూ.94 వేల కోట్లు ఖర్చైన ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల కుంభ కోణం ఎలా జరుగుతుంది. మేస్త్రీలు లేకనే మేడిగడ్డ బ్యారేజీకి పునర్నిర్మాణం చేపట్టడం లేదా రేవంత్?. పంజాబ్, హర్యానాను తలతన్నేలా వరి ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ నంబర్ వన్ స్థానంలో ఉంది. దేశంలో ఎవరు చేయలేని పని కేసీఆర్ చేశారు. రైతులు ఎండినా పర్వాలేదు కానీ ప్రాజెక్టును అడ్డంపెట్టుకొని టైమ్ పాస్ చేస్తోంది కాంగ్రెస్. ఈ రాష్ట్రానికి కాళేశ్వరం వరం. 26 జిల్లాల్లో కరవు పరిస్థితులు ఉన్నాయి. కాంగ్రెస్, రేవంత్ పాలనలో నీటి సమస్యలు పెరుగుతున్నాయి. హైదరాబాద్‌కు తాగునీటి సమస్యలు వస్తాయని ఆందోళనగా ఉంది. కేసీఆర్‌ను సంప్రదించి భారీ స్థాయిలో కన్నెపల్లి పంప్‌హౌస్‌ను ముట్టడించి మోటార్లు ఆన్ చేస్తాం' అని హెచ్చరించారు.

# ముంబయిని ముంచెత్తిన కుండపోత వర్షం- రెడ్ అలర్ట్ జారీ- వరదలతో జనజీవనం అస్తవ్యస్తం

మొదటి పేజి తరువాయి

నగరంలోని పలు ప్రాంతాల్లో చెట్లు విరిగిపడటం, రోడ్లు కుంగిపోవడం, కొన్ని పాత ఇళ్లకు నష్టం కలగడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి.

### రంగంలోకి రెస్క్యూ బృందాలు

పరిస్థితి విషమించడంతో రెస్క్యూ బృందాలు వెంటనే రంగంలోకి దిగాయి. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను వేగవంతం చేశారు. సుమారు 10 వేల మందికి పైగా సిబ్బందిని సహాయక చర్యల కోసం మోహరించినట్లు అధికారులు తెలిపారు. నగరంలో నీటి నిల్వలను తొలగించేందుకు 448 డీవాటరింగ్ పంపులు, 19 మినీ పంపింగ్ స్టేషన్లు నిరంతరం పనిచేస్తున్నాయని వెల్లడించారు. ముంబయితో పాటు థానే, పాల్ఘర్ జిల్లాల్లో కూడా భారీ వర్షాలు ప్రజలను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేశాయి. పాల్ఘర్ జిల్లాలో వరద నీటిలో కొట్టుకుపోయి ఆరేళ్ల చిన్నారి మృతి చెందింది. మరోవైపు వరదల్లో చిక్కుకున్న 180 మందిని రక్షించి సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు.

### బయటకు రావద్దని సూచన

పుణె జిల్లాలోనూ భారీ వర్షాల ప్రభావం కనిపించింది. పలుచోట్ల కొండచరియలు విరిగిపడటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఆదివారం కూడా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించింది. వెస్ట్రన్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ వినీత్ అభిషేక్ మాట్లాడుతూ, భారీ వర్షాలు కురిసినా రైలు సేవలు కొనసాగుతున్నాయని తెలిపారు. "వెస్ట్రన్ రైల్వే సబర్బన్ నెట్‌వర్క్ పరిధిలో కొన్ని ప్రాంతాల్లో 250 మిల్లీమీటర్లకు పైగా, మరికొన్ని చోట్ల 150 నుంచి 200 మిల్లీమీటర్ల వరకు వర్షపాతం నమోదైంది. అయినా లోకల్, దూరప్రాంత రైళ్ల రాకపోకలకు పెద్దగా అంతరాయం కలగలేదు. శనివారం రాత్రి నుంచి ముఖ్యంగా ఆదివారం తెల్లవారుజామున సముద్రపు పోటు సమయంలో కూడా భారీ వర్షం కురిసింది. అయినప్పటికీ వెస్ట్రన్ రైల్వే పరిధిలో రైలు



సేవలను నిరంతరాయంగా కొనసాగించగలిగాం."

– వినీత్ అభిషేక్, వెస్ట్రన్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్

### బీఎంసీ హెల్ప్‌లైన్

మరోవైపు బృహన్‌ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) ప్రజలకు కీలక సూచనలు జారీ చేసింది. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే వెంటనే బీఎంసీ హెల్ప్‌లైన్ "1916"కు సమాచారం ఇవ్వాలని సూచించింది. నగరంలో మెట్రో, బెస్ట్ బస్సు సేవలు యథావిధిగా కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. అయితే సబర్బన్ లోకల్ రైళ్లు కొన్ని మార్గాల్లో స్వల్ప ఆలస్యంతో నడుస్తున్నాయని ప్రయాణికులు తెలిపారు.

### ఎక్కువ వర్షపాతం నమోదైన ప్రాంతాలు

బీఎంసీ గణాంకాల ప్రకారం, 200 మి.మీ కంటే ఎక్కువ వర్షపాతం నమోదైన ప్రాంతాలలో మలబార్ హిల్, మాండవి ఫైర్ స్టేషన్, కొలాబా, మెమోన్‌వాడ ఫైర్ స్టేషన్, విక్రోలి ఫైర్ స్టేషన్, పోవాయిలోని పాస్పోలి మున్సిపల్ స్కూల్, భండప్ కాంప్లెక్స్, అంధేరి ఫైర్ స్టేషన్, చకాలా మున్సిపల్ స్కూల్, జోగేశ్వరి, గోరేగావ్‌లోని ఆరే కాలనీ ఉన్నాయి. అలాగే శనివారం మధ్యాహ్నం వివిధ ప్రాంతాల్లో రైలు పట్టాలు నీట మునగడం వల్ల సెంట్రల్, వెస్ట్రన్ రైల్వేల సబర్బన్ సేవలకు కొంతకాలం అంతరాయం కలిగింది. అదే సమయంలో, సాంకేతిక లోపం కారణంగా మెట్రో లైన్ 2ఏ సేవలకు కూడా అంతరాయం ఏర్పడింది.

### దట్టమైన పొగమంచు అలుముకున్న దృశ్యాలు

ఇదిలా ఉండగా, హిమాచల్ ప్రదేశ్‌లో కూడా వర్షాలు కొనసాగుతున్నాయి. మండి జిల్లాలో బియాస్ నదిపై దట్టమైన పొగమంచు అలుముకోవడంతో ప్రకృతి అందాలు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. కొండలను ఆవరించిన మేఘాలు, నదిపై కమ్ముకున్న పొగమంచుకు సంబంధించిన డ్రోన్ దృశ్యాలను అధికారులు విడుదల చేశారు. అయితే హిమాచల్‌లో అందమైన దృశ్యాలతో పాటు ప్రమాద హెచ్చరికలు కూడా జారీ అయ్యాయి. రానున్న మూడు రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. దీంతో ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. భారీ వర్షాల కారణంగా ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటం, లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం వంటి ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని హెచ్చరించింది.

### సింగరేణి విశ్రాంత కార్మికులకు
# రూ.30 లక్షల ప్రమాద బీమా.
### ఐఎన్‌టీయూసీ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య



మంచిర్యాల,: సింగరేణి విశ్రాంత కార్మికుల ఐకమత్యం, వారు చేసిన నిరంతర పోరాటాల ఫలితంగానే విశ్రాంత ఉద్యోగులకు రూ.30 లక్షల ప్రమాద బీమా సౌకర్యం చేకూరిందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య ఒక ప్రకటనలో తెలిపారు.ఈ బీమా పథకం పదవీ విరమణ పొందిన కార్మికుల కుటుంబాలకు ఎంతో మేలు చేస్తుందని, వారికి ఆర్థికంగా కొండంత భరోసాను కల్పిస్తుందని ఆయన పేర్కొన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లలో ఖాతాలు కలిగిన సింగరేణి విశ్రాంత ఉద్యోగులందరూ ఈ ప్రమాద బీమా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అర్హులైన విశ్రాంత ఉద్యోగులు వెంటనే తమ సంబంధిత బ్యాంకు శాఖలను సంప్రదించాలి. బీమా సౌకర్యం యాక్టివేట్ కావడం కోసం అవసరమైన ధ్రువీకరణ పత్రాలను బ్యాంకు అధికారులకు అందజేయాల్సి ఉంటుంది. అర్హత కలిగిన ప్రతి సింగరేణి విశ్రాంత ఉద్యోగి ఆలస్యం చేయకుండా ఈ పథకంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలి. ప్రభుత్వం కల్పించిన ఈ ఆర్థిక భద్రతను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి.అని అయన కోరాడు.

### అభిషేక్ - సాయి రేఖ వివాహానికి
# టీఎస్టీడబ్ల్యూటీయూ నేతలు
### వివాహ వేడుక, పాల్గొన్న గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యవర్గం



ఆసిఫాబాద్ : మంచిర్యాల పట్టణంలోని పద్మనాయక కల్యాణ మండపంలో ఆదివారం అభిషేక్ – సాయి రేఖ వివాహం వైభవంగా జరిగింది. కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పీఎంఆర్సీ ఏసీఎంవో పూర్కా ఉద్దవ్ సోదరుని కుమారుడు అభిషేక్‌కు ఈ వివాహం జరిగింది. తెలంగాణ రాష్ట్ర గిరిజన ఉపాధ్యాయుల సంక్షేమ సంఘం (టీఎస్టీడబ్ల్యూటీయూ) జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రవీందర్ ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వేద మంత్రాల నడుమ, పుష్ప అలంకరణ మధ్య జరిగిన తలంబ్రాల కార్యక్రమంలో సంఘం సభ్యులు వధూవరులపై అక్షింతలు జల్లి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు కూడ్మేత అనంత్, కోర్వేత మనోహర్, మహిళా కార్యదర్శులు కొట్నాక్ శకుంతల, మంజుల, ఉయిక తుకారం, కుమురం మధుసూదన్, కుర్సెంగా శంకర్‌తో పాటు మంచిర్యాల జిల్లా సభ్యులు మాడావి శంకర్, పెంద్రం రాజేష్, నైతం శ్రీను, కోచ్ విద్యాసాగర్ పాల్గొన్నారు.

# ఎన్ హెచ్ ఆర్ సి చైర్మన్‌పై తప్పుడు కేసు
### సర్పంచులపై చర్యలు కోరుతూ ఎస్పీకి గ్రామస్తుల ఫిర్యాదు



ఆసిఫాబాద్ : కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కేరమేరి మండలంలోని పరండోలి, ముఖదంగూడా సర్పంచుల అవినీతిపై గ్రామస్తులు గత సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అభివృద్ధి పనులు చేయకుండా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని, సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఫిర్యాదుతో తమ అవినీతి బయటపడుతుందనే భయంతో సర్పంచులు ఎన్‌హెచ్ఆర్సీ జిల్లా చైర్మన్ రాథోడ్ రమేష్‌పై ఎదురు కేసు నమోదు చేయించారని గ్రామస్తులు ఆరోపించారు.ఫిబ్రవరి 15న కేరమేరి మండల కేంద్రంలో జరిగిన సేవాలాల్ జయంతి శోభాయాత్ర, అన్నదాన కార్యక్రమానికి పరండోలి సర్పంచ్ భర్త, కానిస్టేబుల్ చరణ్ రాథోడ్ ఫిబ్రవరి 13న ఫోన్‌పే ద్వారా రూ.3,000 చందాగా చెల్లించిన విషయం కమిటీ డైరీలో నమోదైంది. ఈ చందా మొత్తాన్నే బ్లాక్‌మెయిల్ డబ్బుగా చిత్రీకరిస్తూ, పరండోలి సర్పంచ్ పుష్పలత రాథోడ్‌తో, ముఖదంగూడా సర్పంచ్‌తో కలిసి కేరమేరి పోలీస్ స్టేషన్‌లో చరణ్ రాథోడ్ తప్పుడు ఫిర్యాదు చేయించినట్టు గ్రామస్తుల వాదన. దీనికితోడు, ముఖదంగూడా సర్పంచ్ భర్త జాదవ్ కేశవ్, అతని నలుగురు అనుచరులు రమేష్ ఇంటిపై దాడికి యత్నించి, ఇంట్లో లేని సమయంలో అతని భార్యాపిల్లలను బెదిరించి, ప్రాణహాని హెచ్చరికలు చేశారని ఆరోపణలు వచ్చాయి.ఈ పరిణామాలపై పరండోలి, కోట, శంకర్‌లోధి, లెండిజాల, ముఖదంగూడా గ్రామాలకు చెందిన ప్రజలు శనివారం పెద్ద సంఖ్యలో జిల్లా ఎస్పీ కార్యాలయానికి చేరుకున్నారు. తప్పుడు ఫిర్యాదు వెనుక ఉన్న కానిస్టేబుల్ చరణ్ రాథోడ్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, జాదవ్ కేశవ్‌తో పాటు అతని అనుచరులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాతపూర్వక ఫిర్యాదు అందజేశారు. అలాగే గ్రామపంచాయతీ నిధుల దుర్వినియోగంపై గ్రామసభ ఏర్పాటు చేసి, అందరి సమక్షంలో సమగ్ర విచారణ జరపాలని కేరమేరి ఎంపీవోను కూడా కోరారు.


# మానవ-వన్యప్రాణి సంఘర్షణ నివారణకు కృషి
### దుబ్బగూడ ప్లాంటేషన్‌లో మొక్కల పెంపకం ప్రారంభించిన ఎఫ్డీవో డా. అప్పయ్య



సిర్పూర్ టి : మనుషులు, వన్యప్రాణుల మధ్య సంఘర్షణ పెరుగుతున్న నేపథ్యంలో అటవీ శాఖ చర్యలు చేపడుతోందని కాఘజ్‌నగర్ ఫారెస్ట్ డివిజన్ అధికారి డా. అప్పయ్య తెలిపారు. జంతువుల ఆవాసాలు ధ్వంసం కావడం, పోడు వ్యవసాయం పేరుతో అటవీ భూముల ఆక్రమణ వల్ల వన్యప్రాణులు ఆవాసం కోల్పోయి అటవీ ప్రాంతం నుంచి బయటకు వస్తున్నాయని వివరించారు. ఈ సంఘర్షణను తగ్గించేందుకు కోల్పోయిన అటవీ భూములను తిరిగి స్వాధీనం చేసుకుని మొక్కల పెంపకం చేపడుతున్నట్టు తెలిపారు.ఆదివారం సిర్పూర్ రేంజ్‌లోని దుబ్బగూడ ప్లాంటేషన్‌ను సందర్శించిన సందర్భంగా, గతంలో అదే ప్రాంతంలో పులి దాడిలో గాయపడ్డ రౌతు సురేష్ చేతుల మీదుగా మొక్కలు నాటించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్లాంటేషన్‌లో పనిచేస్తున్న కూలీలకు రెయిన్‌కోట్లు, గ్లౌజులు, పనిముట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్, సెక్షన్ ఆఫీసర్ మోహన్ రావుతో పాటు అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# అంతులేని ఆశ... తేలికపాటి జల్లులు: వానదేవుడా ఎప్పుడొస్తావ్?

ఒకవైపు పత్తి మొలకల ఆనందం..
మరోవైపు వరి సాగుపై ఆందోళనలి
ఎల్ నినో ప్రభావంతో అడుగంటిన చెరువులు, కుంటలు
రెబ్బెన మండలంలో బీడు వారుతున్న భూములు..
పెట్టుబడి భారంతో రైతన్న విలవిల



రెబ్బెన,: రైతు గుండెల్లో ఒకవైపు ఆనందం,మరోవైపు ఆందోళన నెలకొంది. ఆకాశం వైపు కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్న రైతాంగానికి ప్రస్తుత వాతావరణం అంతుచిక్కడం లేదు. కురుస్తున్న తేలికపాటి జల్లులకు నాటిన పత్తి గింజలు మొలకెత్తడంతో ఒక పక్క ఆనందపడుతున్నా, వరి సాగుకు మాత్రం చుక్క నీరు లేక చెరువులు,పొలాలు వెలవెలబోతుండటంతో అన్నదాతలు తీవ్ర ఆందోళనలో మునిగిపోయారు. జూలై నెల వచ్చినా వరి మొలక ఆలకలేదని, ఎటు తేల్చుకోలేని సందిగ్ధ స్థితిలో రైతన్నలు కొట్టుమిట్టాడుతున్నారు.

### ఎల్ నినో శాపం.. అడుగంటిన జలాశయాలు

ప్రతి సంవత్సరం జూలై మొదటి వారంలోనే వరి మొలకలు అలికే (నాట్లు వేసే) పనుల్లో రైతులు నిమగ్నమయ్యేవారు. కానీ, ఈ ఏడాది 'ఎల్ నినో' ప్రభావం రైతులకు శాపంగా మారింది.కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలంలో అత్యధికంగా వరి పంట సాగు చేస్తుంటారు. కానీ ఈసారి జూలై నెల ముగుస్తున్నా. ఇప్పటివరకు తేలికపాటి జల్లులు తప్ప, కనీసం మోస్తరు వర్షం కూడా కురవలేదు.దీంతో కుంటలు,చెరువులు అడుగంటిపోయాయి. ప్రతి ఏటా కంటే ఈసారి వర్షాలు ఆలస్యం కావడం వల్ల పత్తి నాటడం కూడా చాలా ఆలస్యమైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకో 15 రోజులు భారీ వర్షాలు పడకుంటే ఈ ఏడాది పొలాలు వేయలేని పరిస్థితి వస్తుంది. అని స్థానిక రైతులు ఆందోళన చెందుతున్నారు.

### ఆకాశాన్నంటుతున్న ఎరువుల ధరలు.. రైతుకు పెట్టుబడి భారం


ఒకవైపు ప్రకృతి కన్నెర్ర జేస్తుంటే, మరోవైపు మార్కెట్లో పెరిగిన ఎరువుల ధరలు రైతన్నలపై గుదిబండగా మారాయి.ఎరువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నా.రైతు పండించిన పంటకు మాత్రం గిట్టుబాటు ధర దక్కడం లేదు. విత్తనాలు,ఎరువుల కొనుగోళ్లకే వేలాది రూపాయలు అప్పులు చేయాల్సి వస్తోందని, తీరా పంట చేతికొచ్చాక అమ్ముకుందామంటే కనీస ధర లేక దళారుల చేతిలో మోసపోతున్నామని రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు.

### బ్రతుకు భారమై. సాగు కష్టతరమై!

రానురాను వ్యవసాయం పూర్తిగా చేయలేని పరిస్థితి నెలకొంది.అటు వాతావరణం సహకరించక,ఇటు పెట్టుబడి ఖర్చులు భరించలేక వ్యవసాయం భారంగా మారింది.రెబ్బెన మండలంలో ప్రతి ఏటా కళకళలాడే చాలా గ్రామాల్లో.ఈసారి భూములు నిస్సారంగా, బీడు వారి కనిపిస్తున్నాయి. రాబోయే రెండు వారాల్లో గనక ఆశించిన స్థాయిలో భారీ వర్షాలు కురవకపోతే, ఈ ఏడాది పొలాలు పూర్తిగా బీడు భూములుగా మారే ప్రమాదం ఉందని రైతాంగం కన్నీటి పర్యంతమవుతోంది. పాలకులు, అధికారులు స్పందించి తమను ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

# ఆసిఫాబాద్ పోలీస్ బదిలీల్లో సస్పెన్స్

### కానిస్టేబుళ్లలో 'అయోమయం'.. పైరవీకారుల 'గాలం'!




ఆసిఫాబాద్ : కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ శాఖలో సాధారణ బదిలీల ప్రక్రియ నిలిచిపోవడం ఇప్పుడు జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.బదిలీల కోసం దరఖాస్తు చేసుకుని,ఉత్తర్వుల కోసం వేచి చూస్తున్న కానిస్టేబుళ్లు ప్రస్తుతం తీవ్ర అయోమయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఒకవైపు కొత్త విద్యాసంవత్సరం ప్రారంభమై పిల్లల స్కూళ్లు తెరుచుకుంటున్న తరుణంలో,ఈ బదిలీలు మరింత ఆలస్యమైతే కుటుంబాల వారీగా ఇబ్బందులు పడాల్సి వస్తుందని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.

### స్కూళ్ల సీజన్.. కానిస్టేబుళ్ల టెన్షన్

సాధారణంగా జూన్, జూలై నెలలు పిల్లల చదువులకు అత్యంత కీలకమైనవి.బదిలీ అనుకున్న స్థానానికి వెళ్తేనే పిల్లలను అక్కడ మంచి స్కూళ్లలో చేర్పించుకోవడానికి వీలవుతుంది.అయితే, ప్రక్రియ ఆలస్యం కావడంతో 'ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు?' అనే భయం సిబ్బందిలో వ్యక్తమవుతోంది.ఈ అనిశ్చితిని ఆసరాగా చేసుకుని కొందరు పైరవీకారులు (మిడిల్‌మెన్)రంగ ప్రవేశం చేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. "మేమున్నాం.. మీ పని ముగిస్తాం" అంటూ అమాయక సిబ్బందిని నమ్మించేందుకు కొందరు 'గోతి కాడ నక్కలా' పొంచి ఉండి గాలం వేస్తున్నారనే ప్రచారం క్షేత్రస్థాయిలో కలకలం రేపుతోంది.

### ఆలస్యానికి కారణాలేంటి? వాస్తవ గమ్యం ఇదేనా

నిజానికి,బదిలీల ప్రక్రియ ఆగిపోవడం వెనుక ఉన్న కారణాలను విశ్లేషిస్తే, ఇందులో ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కంటే పరిపాలనాపరమైన, సాంకేతికపరమైన సవాళ్లే ఎక్కువగా ఉన్నాయని తెలుస్తోంది.జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, సమస్యాత్మక ప్రాంతాల్లో అనుభవజ్ఞులైన సిబ్బంది అవసరం, అంతర్గత భద్రతా సమీక్షల వల్లే బదిలీల ప్రక్రియపై ఉన్నతాధికారులు క్షుణ్ణంగా కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.పైరవీలకు తావులేకుండా, అర్హులైన వారికే ప్రాధాన్యత దక్కాలనే యోచనతోనే ఉన్నతాధికారులు ప్రతి దరఖాస్తును నిశితంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.ఎలాంటి అవకతవకలు జరగకూడదనే ఉద్దేశంతోనే ఈ ఆలస్యం జరుగుతోందని విశ్లేషకులు భావిస్తున్నారు.

### జిల్లా ఎస్పీ దృష్టికి వాస్తవాలు.. ఆశావహ దృక్పథం

జిల్లా పోలీస్ బాస్ (ఎస్పీ) ఎప్పుడూ సిబ్బంది సంక్షేమానికి, నిష్పక్షపాత పాలనకు ప్రాధాన్యతనిచ్చే అధికారిగా పేరుపొందారు.ఈ బదిలీల వ్యవహారంలోనూ ఎవరికీ ఎలాంటి అన్యాయం జరగకుండా,నిజమైన ఇబ్బందులు ఉన్న సిబ్బందికి న్యాయం చేయాలనే సదుద్దేశంతోనే వారు ఉన్నట్లు అంతర్గత వర్గాల టాక్. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో నెలకొన్న ఈ ప్రత్యేక పరిస్థితులను, పిల్లల చదువుల దృష్ట్యా సిబ్బంది పడుతున్న ఇబ్బందులను ఎస్పీ సానుకూలంగా పరిశీలిస్తారని, పైరవీకారుల మాటలు నమ్మి సిబ్బంది మోసపోకుండా త్వరలోనే ఒక స్పష్టమైన, పారదర్శకమైన నిర్ణయాన్ని ప్రకటిస్తారని ఆసిఫాబాద్ పోలీస్ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. వివాదాలకు తావులేకుండా, అటు పరిపాలనను సంస్కరిస్తూ.ఇటు సిబ్బంది కష్టాలను తీర్చేలా త్వరలోనే శుభవార్త వస్తుందని అంతా ఆశిస్తున్నారు.

# సిర్పూర్ ఆడపిల్లలకు రూ.1.20 కోట్ల స్కాలర్‌షిప్‌లు
### అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ ద్వారా 120 మంది విద్యార్థినులకు ఆర్థిక సాయం
### వెంకట్రావుపేటకు చెందిన ఇద్దరికీ అవకాశం



కగజ్‌నగర్ : సిర్పూర్ నియోజకవర్గంలోని 120 మంది ఆడపిల్లలకు అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ ద్వారా రూ.1.20 కోట్ల స్కాలర్‌షిప్‌లు అందేలా సుప్రీం స్వేరో ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ కృషి చేశారు. ఈ అరుదైన అవకాశాన్ని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థినులు కూడా దక్కించుకున్నారు, ఇది గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో విద్యార్థినులను శాలువాతో సత్కరించే సేవలో భాగస్వాములు కావడంపై నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి ఆహ్వానించి, సేవ చేసే అవకాశం కల్పించినందుకు సిర్పూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ అధ్యక్షుడు అస్లాం భీంకు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజలకు ఉపయోగపడే ఇలాంటి కార్యక్రమాల్లో మరిన్ని సేవా అవకాశాలు లభించాలని ఆకాంక్షించారు.

# ఏఐటీయూసీ జిల్లా మహాసభలకు పిలుపు
### ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్, కార్మికుల సమస్యలపై హెచ్చరిక




ఆసిఫాబాద్ : ఏఐటీయూసీ జిల్లా నాలుగో మహాసభలు ఈ నెల 26న ఆసిఫాబాద్‌లోని మైనార్టీ ఫంక్షన్ హాల్‌లో జరగనున్నాయని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ తెలిపారు. జిల్లాలోని కార్మికులు, కర్షకులు అధిక సంఖ్యలో పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆసిఫాబాద్‌లోని ఎస్టీయూ భవన్‌లో యూనియన్ ఉపాధ్యక్షుడు జాడి లక్ష్మణ్ అధ్యక్షతన ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ డిపో కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బోగే ఉపేందర్ మాట్లాడుతూ, ఆర్టీసీని వెంటనే ప్రభుత్వంలో విలీనం చేసి అపాయింట్‌మెంట్ తేదీని ప్రకటించాలని, కార్మికుల పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గుర్తింపు సంఘం ఎన్నికలు వెంటనే నిర్వహించాలని, కార్మికులపై అధికారుల వేధింపులను నిలిపివేయాలని కోరారు. రోజురోజుకూ ఆర్టీసీ కార్మికులపై అధికారుల వేధింపులు పెరుగుతున్నాయని, ఇవి ఆగకపోతే టీజీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సిసిఎస్ ఎన్నికలు వెంటనే నిర్వహించాలని కూడా డిమాండ్ చేశారు.

### హుజూరాబాద్‌లో రేషన్ బియ్యం దందాపై
## 'టాస్క్‌ఫోర్స్' విసురు.. భారీగా పీడీఎస్ బియ్యం సీజ్!




హుజూరాబాద్,: పేదలకు చేరాల్సిన రేషన్ బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలుతుందన్న పక్కా సమాచారంతో అధికారులు మెరుపు దాడి చేశారు. హుజూరాబాద్ పట్టణంలోని ఒక కిరాణా దుకాణాన్ని టార్గెట్ చేసిన అధికారులు.అక్కడ అక్రమంగా నిల్వ ఉంచిన భారీ ప్రజా పంపిణీ వ్యవస్థ బియ్యం నిల్వలను పట్టుకున్నారు. ప్రభుత్వం పేద ప్రజల కోసం ఉచితంగా సరఫరా చేస్తున్న రేషన్ బియ్యాన్ని కొందరు అక్రమార్కులు తక్కువ ధరకే కొనుగోలు చేసి నిల్వ ఉంచుతున్నారు. ఈ క్రమంలోనే సదరు కిరాణా వ్యాపారి పెద్ద ఎత్తున బియ్యం సంచులను దాచి ఉంచినట్లు అధికారులు గుర్తించారు.తనిఖీల్లో దొరికిన నిల్వలను తక్షణమే సీజ్ చేసి, సదరు దుకాణదారుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. "పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనాలన్నా, అమ్మాలన్నా,నిల్వ ఉంచాలన్నా చట్టప్రకారం నేరం. ఇలాంటి అక్రమ దందాలకు పాల్పడితే ఎంతటి వారైనా సరే కఠిన చర్యలు తప్పవు. ప్రజలకు కూడా ఎక్కడైనా ఇలాంటి అక్రమ రవాణా లేదా నిల్వలు కనిపిస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలి అని వారు కోరారు..

# చదవడమూ ఓ కళే!

చదవడం అంటే కేవలం అక్షరాలను గుర్తుపట్టే నైపుణ్యం కాదు, అక్షరాలతో మాట్లాడటం. ఆ రెండింటి మధ్య చాలా తేడా ఉంది. పుస్తకాన్ని తెరిచామంటే– ఒక కొత్త ప్రపంచంలోకి అడుగు పెట్టినట్లే. ఆ ప్రపంచంలో మనం పాఠకులం మాత్రమే కాదు... పాత్రలమూ అవుతాం, కాలాలను దాటుతాం, లేని మనుషులతో మాట్లాడతాం, రాబోయే వసంతాల పరిమళాలను ఆస్వాదిస్తాం. చదవడం అంటే అక్షరాలను చూడటం కాదు, వాటి వెనుక దాగి ఉన్న ఆలోచనలను స్పృశించడం. పేజీలను తిప్పడం కాదు, ప్రపంచాన్ని దర్శించడం. పదాలను గుర్తించడం కాదు, భావాలను అనుభవించడం. అసలైన పాఠకుడు అక్షరాల వెనుక ఉన్న అంతరంగాన్ని చదువుతాడు. రచయిత హృదయంతో మమేకమవుతాడు, రచయిత రాసింది మాత్రమే కాదు, రాయలేకపోయిందీ చదువుతాడు. స్వీయానుభవం లేకుండానే అనుభూతిని పొందడం, మనసుతో చదివే వ్యక్తికి ఒక గొప్ప వరం. సముద్రం చూడనివాడు కూడా అక్షరాలలో అలల సవ్వడి వినగలడు. యుద్ధం చూడనివాడు కూడా దాని బాధితుల ఆర్తనాదాలను ఆలకించగలడు. పేదరికం అంటే ఏంటో తెలియనివాడు కూడా ఒక దీనుడి కష్టాన్ని గుర్తించగలడు. ఒక పుస్తకాన్ని సమగ్రంగా చదివితే మన వ్యక్తిత్వంలో, మన ఆలోచనా విధానంలో మనకి తెలీకుండానే ఏదో ఒక మార్పు వస్తుంది. ప్రస్తుత డిజిటల్ యుగంలో అపరిమితమైన సమాచారం తెరలమీద వేగంగా కదిలిపోతోంది. ఎంత చదివినా ఏదీ మనసులో నిలవడం లేదు. ఎందుకంటే మనం ఆ చదవడాన్ని కళగా సాధన చేయడం లేదు, యాంత్రికంగా చేస్తున్నాం. కేవలం... చూస్తున్నాం. చూడటం కళ్ల పని. చదవడం మనసు పని. చూస్తే సమాచారం మాత్రమే తెలుస్తుంది, చదివితే జ్ఞానం లభిస్తుంది. చదవడం తెలివితో పాటు వినయాన్ని, సహనాన్ని నేర్పుతుంది. మనతో విభేదించే వ్యక్తుల ఆలోచనలను కూడా అర్థం చేసుకునే విశాల దృష్టిని, సహానుభూతిని పెంచుతుంది. మన అంతరంగ స్వరాన్ని మనకు వినిపిస్తుంది. చదవడం అభిరుచి మాత్రమే కాదు– మానసిక ప్రశాంతతకు, వ్యక్తిత్వ వికాసానికి, జ్ఞాన సమృద్ధికి మార్గం. చదవడాన్ని కళగా మార్చుకోడానికి కొన్ని సూత్రాలున్నాయి. నెమ్మదిగా అలవాటు చేసుకోవాలి. ఒక మంచి వాక్యం దగ్గర ఆగి, మళ్లీ చదవాలి. అందమైన పదబంధం కనిపిస్తే కాస్త ఆగి ఆలోచించాలి. పాత్రతో మమేకమై నడవాలి. చదివింది సరైనదేనా? దానికి ఇంకో కోణం ఏమైనా ఉందా? అని మనల్ని మనం ప్రశ్నించుకోవాలి. అవసరమైతే మళ్లీ మళ్లీ చదవాలి.. రెండోసారి చదివినప్పుడు మొదటిసారి కనపడని అర్థాలు కనపడతాయి. పుస్తకం మారదు, మనమే మారతాం, మన అనుభవం విస్తృతమై కొత్త అర్థాలు స్ఫురిస్తాయి. చివరగా అందులో మనకు నచ్చింది రాసుకోవాలి. ఉన్నది ఉన్నట్లుగా లేదా దాని మీద మన వ్యాఖ్యలో రాసుకోవచ్చు. ఈ విధంగా ప్రయత్నించి చూడండి. అప్పుడు చదివే కళ మీకు పట్టుబడుతుంది. అక్షరాల వెనుక అర్థాలను గ్రహించగలిగే కొందరిలో మీరూ ఒకరవుతారు. చదువరులవుతారు!

# వర్షానికి గొల్లపల్లి మెయిన్ రోడ్డు బురదమయం




**నిత్యం అవస్థలు పడుతున్న గ్రామస్తులు**

**నెన్నెల్ మండలం, గొల్లపల్లి గ్రామంలో దయనీయ పరిస్థితి**

**బెల్లంపల్లి ప్రతినిధి :** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గంలోని నెన్నెల్ మండలం గొల్లపల్లి గ్రామంలో ప్రతి వర్షాకాలం రాగానే మెయిన్ రోడ్డు పూర్తిగా బురదమయంగా మారి గ్రామస్తులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. రహదారిపై నడవడమే కష్టంగా మారడంతో చిన్నారులు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, రైతులు నిత్యం అవస్థలు పడుతున్నారు. వర్షపు నీరు రోడ్డుపై నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ వంటి సేవలు కూడా గ్రామంలోకి చేరుకోవడం కష్టసాధ్యంగా మారుతోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "ఊరు మారాలి.. బ్రతుకులు మారాలి అనుకుంటాం. కానీ ప్రతి వర్షానికి మా రోడ్డు మాత్రం బురదలోనే కూరుకుపోతోంది. అభివృద్ధి మాటల్లోనే కనిపిస్తోంది కానీ మా గ్రామంలో మాత్రం ఇప్పటికీ ప్రాథమిక సౌకర్యాలు అందుబాటులో లేవు. ఎన్నో ఏళ్లు గడిచినా, పాలకులు మారినా మా ఊరి రోడ్డు పరిస్థితి మాత్రం మారలేదు" అని గ్రామస్తులు వాపోతున్నారు. గొల్లపల్లి గ్రామ మెయిన్ రోడ్డును వెంటనే సీసీ రోడ్డు లేదా బీటీ రోడ్డుగా నిర్మించి, వర్షపు నీరు నిల్వకుండా డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# కేసీఆర్ పై కక్షతో రైతులకు శిక్ష వేస్తారా? కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ నిప్పులు

**పోలీసుల ఆంక్షలు, అడ్డంకులను దాటి కన్నెపల్లి పంప్ హౌస్‌కు చేరుకున్న బీఆర్ఎస్ బృందం**

**పెంబర్తి వద్ద హైడ్రామా.. అరగంట పాటు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయిన మంత్రి సీతక్క**

**లక్ష క్యూసెక్కుల నీరు సముద్రంపాలు అవుతున్నా మోటార్లు ఎందుకు ఆన్ చేయడం లేదు?**

**ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరో జూలై 05 :** గోదావరి నీళ్లు కిందకు వృథాగా పారుతున్నా, పైన పొలాలు ఎండుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వానికి కన్పించడం లేదా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ సీఎం కేసీఆర్ మీద ఉన్న రాజకీయ కక్షతో తెలంగాణ రైతులకు శిక్ష వేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని కన్నెపల్లి పంప్ హౌస్ సందర్శనకు ఆదివారం బయలుదేరిన కేటీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రతినిధుల బృందాన్ని జనగామ జిల్లా పెంబర్తి వద్ద పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత, హైడ్రామా నెలకొంది. ఎన్నో అడ్డంకులను అధిగమించి చివరకు కేటీఆర్ తన బృందంతో కలిసి కన్నెపల్లి పంప్ హౌస్‌కు చేరుకుని, అక్కడి పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

**పెంబర్తి వద్ద రోడ్డుపై బైఠాయిస్తానని కేటీఆర్ హెచ్చరిక**

ఆదివారం ఉదయం హైదరాబాద్ నుండి భారీ కాన్వాయ్‌తో బయలుదేరిన కేటీఆర్ బృందాన్ని పోలీసులు జనగామ జిల్లా పెంబర్తి వద్ద నిలిపివేశారు. కేవలం కేటీఆర్ ఒక్కరికే అనుమతిస్తామని, మిగిలిన వాహనాలను పంపబోమని పోలీసులు చెప్పడంతో కేటీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. "రైతుల పొలాలుఎండుతుంటే చూపించడానికి వెళ్తున్నాం.. దీనిని కూడా అడ్డుకుంటారా? అన్ని వాహనాలను పంపితేనే ముందుకు వెళ్తాం. లేదంటే ఇక్కడే రోడ్డుకు అడ్డంగా బండి పెట్టి కూర్చుంటా" అని పోలీసులపై ఫైర్ అయ్యారు. దీంతో పోలీసులు వెనక్కి తగ్గి కాన్వాయ్‌ను అనుమతించారు.

**కేటీఆర్ కాన్వాయ్ అడ్డంకులతో స్తంభించిన రహదారి..**



**చిక్కుకున్న మంత్రి సీతక్క**

కేటీఆర్ పర్యటన నేపథ్యంలో హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై, అలాగే హసన్పర్తి వంగ పహాడ్ చౌరస్తా వద్ద ఔటర్ రింగ్ రోడ్డుపై భారీగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. పెంబర్తి వద్ద పోలీసులు కాన్వాయ్‌ను అడ్డుకున్న క్రమంలో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.ఇదే సమయంలో అదే మార్గంలో వస్తున్న రాష్ట్ర మంత్రి సీతక్క కాన్వాయ్ కూడా ఈ ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుపోయింది. కేటీఆర్ కాన్వాయ్ ముందుకు కదిలే వరకు మంత్రి సీతక్క పెంబర్తి వద్ద సుమారు అరగంట పాటు రోడ్డుపైనే నిలిచిపోవాల్సి వచ్చింది. కన్నెపల్లి వద్ద కేటీఆర్ ప్రెస్ మీట్. లక్ష క్యూసెక్కుల నీరు వృథా.. మోటార్లు ఎందుకు ఆన్ చేయరు? కన్నెపల్లి పంప్ హౌస్ పరిసరాలను పరిశీలించిన అనంతరం కేటీఆర్ మీడియా తో మాట్లాడారు. ప్రస్తుతం సుమారు లక్ష క్యూసెక్కుల గోదావరి నీరు వృథాగా సముద్రంలో కలుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పైన నీళ్లు లేక రైతులు నాట్లు వేసే పరిస్థితి లేకపోయినా ప్రభుత్వం కన్నెపల్లి వద్ద మోటార్లు ఎందుకు ఆన్ చేయడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అనేది రంగారెడ్డి, మహబూబ్ నగర్ మినహా మిగిలిన 7 ఉమ్మడి జిల్లాలకు సాగునీరు, హైదరాబాద్ కు తాగునీరు అందించే అద్భుత వరమన్నారు. వారం రోజులు కేసీఆర్‌కు అప్పగిస్తే తెలంగాణ అంతా నీళ్లు పారిస్తాం "కాంగ్రెస్ ప్రభుత్వానికి చేత కాకపోతే వారం రోజుల పాటు కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ కు అప్పగించండి.. మొత్తం తెలంగాణ నిండా నీళ్లు పారించి చూపిస్తాం" అని కేటీఆర్ సవాల్ విసిరారు. త్వరలోనే కేసీఆర్ ను సంప్రదించి 50 నుండి 60 వేల మందితో కన్నెపల్లి పంప్ హౌస్‌ను ముట్టడించి, పంపులు ఆన్ చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని



హెచ్చరించారు. 50 ఏళ్లుగా 'పోలవరం' కాలేదు.. కేసీఆర్ 4 ఏళ్లలోనే కాళేశ్వరం కట్టారు ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం ప్రాజెక్టు గురించి తాను పుట్టినప్పటి నుండి (50 ఏళ్లుగా) వింటున్నా ఇప్పటికీ పూర్తి కాలేదని, కానీ కాలంతో పోటీ పడి కేసీఆర్ కేవలం నాలుగేళ్లలోనే ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుగా కాళేశ్వరాన్ని నిర్మించి రికార్డు సృష్టించారని కొనియాడారు. సూపర్ ఎల్నినో వచ్చినా కాళేశ్వరం దగ్గర నీళ్లు ఉంటాయని ఇంజినీర్లే చెప్పారన్నారు. కాళేశ్వరం సహాయం లేకుండా నే రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేశామన్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డివ్యాఖ్యల పై స్పందిస్తూ.. "2014కు ముందు కాళేశ్వరం లేదు కదా, మరి అప్పుడు ఎందుకు రికార్డు స్థాయిలో పంటలు పండలేదు?" అనిప్రశ్నించారు. కాళేశ్వరం వచ్చాకే కాకతీయ కాలువలకు జలకళ వచ్చిందన్నారు.

**రెండు పిల్లర్ల కుంగుబాటుకు రూ.400 కోట్లు. ఎల్అండ్‌టీనే భరిస్తుంది**

కాళేశ్వరం లోని మూడు బ్యారేజీల్లో కలిపి 370 పిల్లర్లు ఉంటే, కేవలం రెండు పిల్లర్లు మాత్రమే కుంగాయని కేటీఆర్ స్పష్టం చేశారు. ఆ బ్లాక్‌ను పూర్తిగా తొలగించి మళ్లీ నిర్మించడానికి రూ.400 కోట్లు ఖర్చవుతుందని,ఆవ్యయాన్ని ప్రజలపై భారం పడకుండా 'ఎల్ అండ్ టీ' (ఎలు) సంస్థే భరిస్తుందని గుర్తుచేశారు. ఎస్ఎల్బీసీ టన్నెల్ ప్రమాదం లో చనిపోయిన కార్మికుల మృతదేహాలను కూడా పూర్తిగా వెలికితీయలేని ఈ ప్రభుత్వం, కాళేశ్వరంపైబురద జల్లడమే పనిగా పెట్టుకుందని విమర్శించారు. తాముఇక్కడి కి వచ్చింది రాజకీయ కక్ష తీర్చుకోవడానికి కాదని, రైతుల ఇబ్బందులు స్వయం గా చూడాలని కేసీఆర్ పంపితేనే వచ్చామని కేటీఆర్ ముగించారు.

# రహ్మాత్ నగర్ ప్రగతికి ప్రాధాన్యత దశలవారీగా అభివృద్ధి పనులు: కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్

**కాజీపేట 62వ డివిజన్‌లో ఘనంగా 'కే.ఎం. స్ప్రింగ్ గోల్డ్ అపార్ట్‌మెంట్ కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవం**

**రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన స్థానిక కార్పొరేటర్..**

**అపార్ట్‌మెంట్ వాసులతో ఆత్మీయ సమావేశం**

**ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరో జూలై 05 :** డివిజన్ పరిధిలోని రహ్మాత్ నగర్ ప్రాంత ప్రగతికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, కాలనీల్లోని సమస్యలను దశలవారీగా పూర్తి చేసేందుకు నిరంతరం కృషి చేస్తామని కాజీపేట 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ స్పష్టం చేశారు. రహ్మాత్ నగర్‌లోని 'కె.ఎం. స్ప్రింగ్ గోల్డ్ అపార్ట్‌మెంట్‌లో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భం గా కార్పొరేటర్ రిబ్బన్ కట్ చేసి కమ్యూనిటీ హాల్‌ను అధికారికంగాప్రారంభించారు.

**సమస్యల పరిష్కారానికి హామీ**

కమ్యూనిటీ హాల్ ప్రారంభించిన అనంతరం కార్పొరేటర్ జక్కుల



రవీందర్ యాదవ్ అపార్ట్‌మెంట్ నివాసితులతో ఆత్మీయంగా ముచ్చటించారు. గతంలో అపార్ట్‌మెంట్ నివాసితుల సౌకర్యార్థం సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేసిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. రానున్న రోజుల్లో అపార్ట్‌మెంట్ పరిసరాల్లో అంతర్గత సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు తన వంతు కృషి చేస్తానని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు.

**మిఠాయిలు పంచి ఆనందం**

నూతన కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవశుభసందర్భాన్ని



పురస్కరించుకుని కార్పొరేటర్ రవీందర్ యాదవ్ కాలనీ పెద్దలు, మహిళలు, చిన్నారులతో కలిసి మిఠాయిలు పంచుకుని ఆనందం వ్యక్తం చేశారు. స్థానిక నివాసితులు ప్రజాప్రతినిధికి తమ అపార్ట్‌మెంట్ పరిధిలోని పలు సమస్యలను వివరించగా, వాటి పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో కె.ఎం, స్ప్రింగ్ గోల్డ్ అపార్ట్‌మెంట్ ప్రెసిడెంట్, సెక్రటరీ, కమిటీ సభ్యులు, అపార్ట్‌మెంట్ పెద్దలు, నివాసితులు, మహిళలు మరియు చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పరిహారం పేరుతో రైతులను మోసం చేయొద్దు



**ప్రభుత్వానికి సూటి ప్రశ్న**


**మా భూములు మాకే కావాలి**

**ప్రభుత్వానికి భూములు ఇవ్వం**

**ఒక్కో గ్రామానికి 600 ఎకరాలు మినాయించాలి**

**జీవనోపాధి గడిచేదెట్లా**

**రైతుల అభిప్రాయాలు తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే వంశీచందర్ రెడ్డి**



**యాచారం :** టిపిజెఎసి ఆధ్వర్యంలో తాడిపర్తి గ్రామంలో ఫార్మా రైతుల , ఫార్మాసిటీ, ఫ్యూచర్ సెటి భూ సేకరణ సమస్యల పైన ప్రజాభిప్రాయ సేకరణ సభను ఫార్మాసిటీ వ్యతిరేక కమిటీ అధ్యక్షురాలు కవుల సరస్వతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఆదివారం ఈ సభకు జూరి సీనియర్ అడ్వకేట్ రఘునాథ్ ,మానవ హక్కుల సంఘం వేదిక జాతీయ కమిటీ సభ్యులు ఎస్ జీవన్ కుమార్, సీనియర్ జర్నలిస్ట్ వి వసంత లక్ష్మి, యూనివర్సిటీ ప్రొఫెసర్ సుజాత సూరపల్లి ,హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ విజయ్, రిటైర్డ్ తాసిల్దార్ వి బాలరాజు, ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సభకు నాలుగు గ్రామాల రైతులు, కూలీలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. మా భూములు మాకే కావాలి, ఫార్మాసిటీ, ఫ్యూచర్ సిటీ వద్దు అని వారి అభిప్రాయాన్ని తెలియజేశారు. ప్రజాభిప్రాయాలను సేకరించి కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ ద్వారా పంపించాలని తీర్మానం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఫార్మా రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేకపోయారని ఈ సభ ద్వారా ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను పరిహారం పేరుతో మోసం చేయొద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ప్రజల జీవనోపాధిని నష్ట చేయడం మంచిది కాదని అన్నారు. ఊరికో 600 ఎకరాల రెవిన్యూ భూమిని మినయించాలని చెప్పారు. కనీసం జీవనోపాధికి భూములు లేకపోతే ప్రజలు ఎలా బ్రతికేదని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. మా భూములు మా పేర్లు ఆన్లైన్లో ఎక్కించాలని డిమాండ్ చేశారు.

**సభలో సాధారణ మనిషిగా వంశీ చందర్ రెడ్డి**

కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే వంశీ చందర్ రెడ్డి సాధారణ మనిషిగా సభలో కూర్చున్నారు. అధికార పార్టీలో కీలక నేతగా కొనసాగుతున్నారు. రైతులు, ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. రైతులతో మాట్లాడకుండా మౌనంగా ఉండిపోయారు. వంశీ చందర్ రెడ్డిని ప్రభుత్వానికి రైతుల బాధలు కష్టాలు తెలపాలని విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నీలం ఝాన్సీ రమేష్, శ్రీవిద్య, సంఘం చైతన్య రాజు, కానమోని గణేష్, సందీప్, కొండల్ రెడ్డి, సామ నిరంజన్, అచ్చిరెడ్డి, కుందారపు నారాయణ, చెన్నయ్య, దేవుడి, వినోద్ రెడ్డి, సోమయ్య , అనంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మరో ఫ్లోరైడ్ నగరంగా మారే ప్రమాదం ఉంది

**జనవాసాల మధ్య ఘన వ్యర్థలా!**

**4 మండలాలు,40 గ్రామాల ప్రజలను ఉక్కిరిబికిరి చేయనున్న డంపింగ్ యార్డ్**

**ప్రభుత్వం వెంటనే ఏకో టౌన్ జీవో 641ను రద్దు చేయాలి**

**బిఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షులు కాడాల శ్రీశైలం**



**కొత్తూరు, (జులై 05):** జనవాసాల మధ్య డంపింగ్ యార్డ్ ను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలి. కొత్తూరు మండల్ బిఆర్ఎస్ యూత్ అధ్యక్షులు కాడాల శ్రీశైలం. ఆయన మాట్లాడుతూ.. సిద్దాపూర్ శివార్ 252, 278, 361 సర్వే నెంబర్లు 86 ఎకరాల భూమిని ఏకో టౌన్ పేరిట డంపింగ్ యార్డ్ కు ప్రతిపాదించడం ప్రభుత్వానిది సరైన తీరు కాదు. ప్రజా అభిప్రాయ సేకరణ లేకుండా ఎలా? కేటాయిస్తారు. కేవలం సిద్దాపూర్ ఒక్క గ్రామా సమస్య కాదు, ఈ డంపింగ్ యార్డ్ వల్ల తీవ్రంగా నష్టపోయే నాలుగు మండలాలు, మహేశ్వరం, కేశంపేట్, ఫరూక్ నగర్, కొత్తూరు, పరిసర 40 గ్రామాల ప్రజలను నలుదిక్కుల, గ్రౌండ్ లెవెల్ వాటర్ పొల్యూటెడ్ మరియు కాలుష్య వాయువు తో కూడిన వ్యర్థాలను విసర్జన చేయగల సామర్థ్యం ఉన్న ఏకో టౌన్ ను వెంటనే రద్దు చేయాలి. ఇక్కడ స్థానికంగా గ్రామాలలో నివాసం ఉండే భవిష్యత్తు తరాల ప్రజలు తీవ్రంగా నష్ట పోయే ప్రమాదం పొంచి ఉన్నది. మరో ఫ్లోరైడ్ నగరంగా మారే అవకాశం ఉన్నందున ఇక్కడి ప్రజలంతా ప్రాణ త్యాగాలకైనా వెనకాడకుండా ఉద్యమానికి సిద్ధంగా ఉన్నందున ఇకనైనా, ప్రభుత్వం పునరాలోచన చేసి డంపింగ్ యార్డ్ జీవోను రద్దు చేయాలి. అని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# దళిత, గిరిజన బస్తీలను అభివృద్ధి చేయాలి

**ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలి**

**ఎస్సీ కార్పొరేషన్ లో యధావిధిగా కొనసాగించాలి**

**ఉపాధి హామీని నిర్వీర్యం చేయొద్దు**

**కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు అంజయ్య**



**యాచారం :** వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మండల పరిధిలో మల్కిజ్ గూడ, బుల్లి గుట్ట తండా, నీళ్ల పోచమ్మ తండ గ్రామాలలో దళిత గిరిజన సమస్యల పైన పర్యటించారు. వారి సమస్యలను తెలుసుకోవడం జరిగింది. ఆదివారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పెరుమండ్ల అంజయ్య మాట్లాడుతూ.. ప్రతి దళితవాడలో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిరుపేదలకు అందాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో ఎస్సీ కార్పొరేషన్ లో నిర్వీర్యం చేశారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ లోన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులను రుణాలు ఇచ్చి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆయన కోరారు. కొత్తగా పింఛన్లు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎం జంగయ్య, పి సత్యనారాయణ, మహేందర్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధల నడుమ శ్రీనివాస కాలనీలో బొడ్రాయి పండుగ

**ఘనంగా పోచమ్మ దేవి ప్రతిష్ఠాపన, ఆడపడుచులకు సంప్రదాయ పద్ధతిలో వడి బియ్యాలు, చీరలు, గాజుల పంపిణీ**










**మహబూబ్‌నగర్, జూలై 5:** మహబూబ్‌నగర్ పట్టణంలోని శ్రీనివాస కాలనీలో బొడ్రాయి పండుగ ఉత్సవాలు, గ్రామదేవత శ్రీ పోచమ్మ దేవి ప్రతిష్ఠాపన కార్యక్రమం భక్తిశ్రద్ధల నడుమ అత్యంత వైభవంగా నిర్వహించారు. వేద మంత్రోచ్చారణలు, ప్రత్యేక పూజలు, హారతులు, సంప్రదాయ ఆచారాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, పట్టణం, కాలనీ ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, పంటల సుభిక్షం కోసం ప్రార్థనలు చేశారు. మహిళలు, యువకులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు. ఉత్సవాల సందర్భంగా తెలుగు సంప్రదాయాలకు ప్రతీకగా ఆడపడుచులకు వడి బియ్యాలు, చీరలు, గాజులు అందజేశారు. పెద్దలు పసుపు, కుంకుమతో ఆడపడుచులను సత్కరించి ఆశీర్వదించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సంప్రదాయ వేడుక కుటుంబ బంధాలను, ఆప్యాయతను, సాంస్కృతిక విలువలను ప్రతిబింబించింది. ఈ కార్యక్రమంలోయం. రాఘవేందర్ గౌడ్--సప్న, పాల్గుని- విజయ్ కుమార్ గౌడ్, నాగేష్--అనిత దేవి, నాగయ్య గౌడ్--నిర్మల, అల్వాలదర్శన్ గౌడ్--కల్పన, --ఉమాదేవి, శ్రీలత, ఎడ్ల వెంకట నరసమ్మ, సరోజనమ్మ, లలితమ్మ, శ్రీహిత, రోహన్ గౌడ్, ఆదిత్య గౌడ్, శ్రీవర్షతో పాటు పలువురు భక్తులు, మహిళలు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమం అనంతరం నిర్వాహకులు పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేస్తూ, శ్రీ పోచమ్మ దేవి అనుగ్రహంతో ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, ఐశ్వర్యం, ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

# షాద్‌నగర్ చౌరస్తా విస్తరణకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మంత్రి వాకిటి శ్రీహరికి వినతిపత్రం అందించిన ఆర్.ఎన్. రాము




**షాద్‌నగర్, జోన్ ఇంచార్జ్ జూలై 5:** షాద్‌నగర్ ప్రధాన చౌరస్తా విస్తరణ పనులను అత్యవసరంగా చేపట్టి ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ సామాజిక కార్యకర్త ఆర్.ఎన్. రాము షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరిలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్.ఎన్. రాము మాట్లాడుతూ, షాద్‌నగర్ ప్రధాన చౌరస్తాలో రోజురోజుకు వాహనాల రద్దీ పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తరచూ ట్రాఫిక్ జామ్‌లు, రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో చౌరస్తా విస్తరణ అత్యవసరమని పేర్కొన్నారు. పాత జాతీయ రహదారి-లో ఉన్న ఈ కీలక కూడలిని విస్తరించడం ద్వారా ట్రాఫిక్ సమస్య తగ్గడంతో పాటు ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించవచ్చని వినతిపత్రంలో వివరించారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మంత్రి వాకిటి శ్రీహరి సమస్యను పరిశీలించి సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

Printed , Published and Owned by POLAGONI ALIVELU, and Printed at Smilys Online, 6-7-48, Vanasthalipuram, Shopping Complex, Rangareddy-500070. Telangana State and Published from 17-10-25, Plot No.H.No. 4-136/12, Turkayamjal Journalist Colony, Rangareddy501510, Telangana State. Editor: POLAGONI ALIVELU. PRGI No. TGTEL/25/A3190. Phone No: +91 7989151815